కథ

# కాస్త చెప్పి పుణ్యం కట్టుకోండి

**కాకాని కమల**

**చంద్రమ్మ ముగ్గుబుట్టలా ఉన్న తలకి కొబ్బరినూనె రాసుకుని వేలుముడి వేసుకుంది. సబ్బుతో ముఖం కడుక్కొని బొట్టు పెట్టుకునే చోట కొంచెం విభూది రాసుకుంది. ఉతికిన కలనేత చీర కట్టుకుని తెల్లటి మల్లు జాకెట్టు వేసుకుంది. మెళ్ళో రుద్రకాయల దండ, వెండి మురుగులు నిన్ననే అమ్మేసి చేతికి సిల్కుదారం కట్టుకుంది.**

చంద్రమ్మ వయసు యాభై ఐదు. భర్తపోయి చాలా కాలం అయింది. ముగ్గురు కొడుకుల దగ్గర వంతుల వారీగా ఉంటోంది. భర్త ఒక కంపెనీలో వాచ్‌మెన్‌గా చేసేవాడు. చంద్రమ్మ భర్త గట్టయ్య చనిపోయాక చంద్రమ్మ పెద్దకొడుకు ఆ ఉద్యోగంలో చేరాడు. కంపెనీ వాళ్ళే వాచ్‌మెన్ క్వార్టర్ ఇచ్చారు. చిన్న రెండు గదుల షెడ్డు.

రెండో కొడుకు పట్నంలో పెద్ద వ్యాపారస్థుల దగ్గర చిన్న ఏజెంట్ పనులు చేస్తాడు. సైకిల్ మీద వీధులన్నీ ఆ సరుకులు వేసుకుని తిరుగుతూ అమ్ముతాడు. ప్యాకెట్టు అమ్మితే రూపాయి లాభం. ఒకే గదిలో అద్దెకి ఉంటాడు. కాస్త పెద్దగా ఉంటుంది. పెరట్లో చిన్న పంచలాగా కట్టి అందులో ఉంటాడు. భార్య ఇద్దరు పిల్లల్తో ఉంటాడు.

మూడో కొడుకు పది దాకా చదివాడు. స్కూల్లో అటెండర్ పోస్టు చేస్తాడు. రైలుకట్ట కిందకి ఉన్న రెండు అరల రేకుల షెడ్డులో ఉంటాడు. వానాకాలం వస్తే ఇల్లంతా కురుస్తుంది. ఇద్దరు పిల్లలు. చంద్రమ్మ కోడళ్ళు ముగ్గురు ఏవో చిన్నచితకా పనులు చేసి అంతో ఇంతో సంపాదిస్తారు.

తండ్రి గట్టయ్య పోయాక ముగ్గురు కొడుకులు తల్లి బాధ్యత తీసుకోక తప్పలేదు. నాలుగేసి నెలలు తలా ఒక కొడుకు దగ్గర ఉండేలా ఒప్పందం చేశారు పెద్ద మనుషులు.


అయితే ఎవ్వరూ చంద్రమ్మని ఆదరించలేదు. ఆ నాలుగు నెలలు తద్దినం పెట్టినట్లు పిండాకూడు పెట్టేవారు. ఇల్లు ఇరుకు. వానాకాలం వస్తే పడుకోవడానికి జాగా సరిపోయేది కాదు. అక్కడికీ ఇంటెడు చాకిరీ చంద్రమ్మే చేసేది. అయినా కోడళ్ళకి అత్తమీద గిట్టేదికాదు. ఆ నాలుగు నెలలు ఆమెకి పెట్టే ముద్ద కూడా అదనపుఖర్చుగా భావించేవారు.

పోనీ చంద్రమ్మ ఏదన్నా పనిచేద్దాం అన్నా నాలుగేసి నెల్లకి ఏం పని దొరుకుతుంది? ఒకే కొడుకు దగ్గర నిలకడగా ఉంటే ఏదో ఒక పని చేసుకోవచ్చు. కానీ ఆమాత్రం భరించే కొడుకు ఎవరు? ఆ నాలుగు నెలలు ఉండడమే వాళ్లకి సయించటం లేదు. కోడలికి అత్త గిట్టకపోవడం సమంజసమే. కానీ కొడుక్కీ తల్లి గిట్టడం లేదు, పెళ్ళాం బెల్లం తల్లి అల్లం అన్నట్టు.

చంద్రమ్మ భర్త బతికున్న రోజుల్లో కూడా రెండు గదులే. అంతంత సంపాదన. అయినా ఐదుమంది రెండు గదుల్లో బతికారు. వున్నదేదో వండేది. వండేది అంతా సర్దుకు తినేవారు. ముందు పిల్లలకి కడుపునిండా పెట్టి, భర్త తిన్నాక చంద్రమ్మ తినేది. ఒకోరోజు సరిపోయేది కాదు. ఆ వీధిలో ఉన్న చిన్న హోటల్ నించి గంజి తెచ్చేది. ఉప్పుకలిపి అదే కడుపునిండా త్రాగేది చంద్రమ్మ. అంతేగానీ ఏరోజు బిడ్డలకి ముద్ద తక్కువ అవనిచ్చేది కాదు. ఆకలి తెలియకుండా ఒక తల్లి ముగ్గురు బిడ్డల్ని సాకింది. కానీ ఒక్క తల్లిని ముగ్గురు బిడ్డలు సాకలేకపోతున్నారు.

రోజులు గడుస్తున్నకొద్దీ చంద్రమ్మకి బ్రతుకు భారం అవుతోంది. ఏ కొడుకు ఇంట్లోనూ ఉండాలని అనిపించడంలేదు. పూర్వం కొందరు ముసలమ్మలు ''నాకెందుకు వచ్చింది. ఊరు పొమ్మంటోంది, కాడి రమ్మంటోంది. ఏ కాశీయో, రామేశ్వరమో వెళ్ళిపోతాను. ఆమాత్రం నా బ్రతుకు వెళ్లకపోదు'' అనే మాట జ్ఞాపకం వచ్చింది.

వాళ్ళు అలా అనడానికి సరియైన కారణం ఇప్పుడే అర్థం అవుతోంది చంద్రమ్మకి.



''అమ్మా. ఈసారి నా దగ్గర ఉండే వంతు నాలుగు నెలలు అన్న దగ్గరే ఉండు. నాకు ఇల్లు ఇరుకు. చూస్తున్నావుగా. కావాలంటే పదో పరకో వాళ్లకి పంపిస్తాను'' అన్నాడు నిన్న చిన్నకొడుకు.

''నీ ఇంటికి వచ్చే ముందు నీ అన్నలు ఇద్దరూ కూడా ఇలాగే అన్నార్రా'' అంది చంద్రమ్మ.

''అలా ఎట్టా అంటారే. అయినా పెద్ద కొడుకు దగ్గర ఉండాలి నువ్వు. అదే కదా ధర్మం'' అన్నాడు.

''సరేలే'' అంది చంద్రమ్మ పై మాటగా.

కానీ మనసులో వేరే నిర్ణయించుకుంది. చేతికి ఉన్న వెండి కడియాలు అమ్మే సింది.

నాలుగు నెలలపాటు ఆఖరి కొడుకు ఇంట్లో వంతు అయిపోగానే రేకు పెట్టెలో తనకున్న నాలుగు చీరలు, దుప్పటి, తువ్వాలు సర్దుకుంది.

''రేపు మధ్యాన్నం వెడుతున్నారా అబ్బాయి. అప్పటికి నువ్వు డ్యూటీ నించి రావుకదూ'' అంది.

''సరేలే'' అన్నాడు వెళ్లిందేచాలు అన్నట్లు.

కోడలు మూతి విరిచింది. ఈమధ్య కోడలు కూడా ఒక హాస్టల్‌లో స్వీపర్‌గా పనిచేస్తోంది.

''ఒసేయ్ కోడలమ్మా. ఇంటి తాళం సెవి ఎవరి కియ్యమంటావ్'' అంది చంద్రమ్మ.


''ఎదురింట్లో ఇయ్యి అత్తా'' అంది ముభావంగా కోడలు.

మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి తన రేకు పెట్టె పుచ్చుకుని రైలు స్టేషన్‌కి వచ్చింది చంద్రమ్మ.

తల్లి ఊరికి వెళ్లిపోతోంది. మళ్లీ ఎనిమిది నెలల వరకూ రాదు అని తెలిసినా కొడుకు దింపడానికి స్టేషన్‌కి రాలేదు. చంద్రమ్మకి బాధేసింది.

అయినావాడు రాకపోవడం ఒక రకంగా మంచిదే.

వాడు వస్తే పెద్ద కొడుకున్న విజయవాడకి టిక్కెట్ కొనే వాడు. కానీ ఇపుడు తను వెడుతున్నది పెద్దకొడుకు దగ్గరికి కాదు. ఇప్పుడేకాదు ఇంక ఎప్పుడూ ఏ కొడుకు దగ్గరికీ వెళ్ళదు. ఇది తన చివరి ప్రయాణం, ఇప్పుడు తను వెడుతున్నది కాశీకి.




ఇక శేషజీవితం అక్కడే ఏదన్నా ఆశ్రమంలో గడపాలని నిర్ణయించుకుంది. అక్కడికి వచ్చే యాత్రీకుల సామాన్లు మొయ్యడం, వంటకి చితుకులు ఏరుకుని వచ్చి ఇవ్వడం, నాళ్ళ బట్టలు ఉతికిపెట్టడం లాంటి చిన్నాచితకా పన్లు చేస్తూ అక్కడే ఏ ధర్మసత్రంలోనో బ్రతుకు వెళ్ళదీసుకోవాలని నిర్ణయించుకుంది. నిత్యం గంగలో మునిగి ఆ కాశీ శివుడిని దర్శించుకుని ఇంత పుణ్యం సంపాదించుకోవాలి అనుకుంది. 'చివరికి తన బొంది కాశీగంగలో కలిసిపోతే చాలు అంతకంటే ఈ జన్మకి ఇంకేం కావాలి?' అనుకుంది.

అసలు ఈపాటికే తనకి ఈ ఆలోచన రానందుకు తనని తనే నిందించుకుంది. పశ్చాత్తాపం కలిగింది.

''నా కొడుకులు నా కోడళ్ళు'' అనుకుంది. కానీ ఎవరికెవరు?

ఎండిన చెట్టు పొయ్యిలో కాల్చడానికి తప్ప ఇంక ఎందుకు పనికివస్తుంది? పండో కాయో కాస్తుంది అంటే ఎవరన్నా ఓ చెంబుడు నీళ్ళు పోస్తారు. కానీ భూమికే భారంగా ఉన్న ఎండినమోడుకి ఎవరు పోస్తారు? పొయ్యరు సరికదా అనవసరంగా ఉందని గొడ్డలితో నరికిపారేస్తారు.

ఎండినచెట్టు భూమికి భారం.


పండిన తల్లి కొడుకులకి భారం.

చంద్రమ్మ రైలు టిక్కెట్ కౌంటర్ దగ్గరకి వెళ్ళి టిక్కెట్లు ఇచ్చే గుమస్తాని అడుగుతోంది.

''అయ్యా..నేను కాశీకి వెళ్ళాలి. ఏ రైలు ఎక్కాలి బాబూ. టిక్కెట్‌కి ఎంతవుద్ది? ఎన్ని రైలుబళ్ళు మారాలి? కాస్త ఇసిదంగా సెప్పి పుణ్యం కట్టుకోండయ్యా...''

## జైత్రయాత్ర

**ఒక్కడు సినిమా ఇచ్చిన స్ఫూర్తితో మహేష్‌బాబు దూసుకుపోతున్నాడు. ఇప్పుడు సూపర్‌స్టార్ కృష్ణ నిర్మాణ సారథ్యంలో రమేష్‌బాబు నిర్మాతగా పరిచయం అవుతూ 'అర్జున్' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కూడా ఒక్కడు తరహాలో స్పెషల్‌గా సెట్స్ వేస్తున్నారు. గుణశేఖర్ దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్న ఈ చిత్రం కోసం గండిపేటలోని పద్మాలయా గార్డెన్స్‌లో మూడుకోట్లతో మదుర మీనాక్షి దేవాలయం సెట్‌ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. సౌత్ ఇండియాలో ఒక సినిమా కోసం ఇలాంటి సెట్ వేయడం ఇదే ప్రథమం. మహేష్‌బాబుకి జంటగా శ్రీయ నటిస్తున్న ఈ చిత్రంలో కీర్తిరెడ్డి కూడా నటిస్తోంది. భారీహిట్ కొట్టేందుకు వీలుగా ఈ చిత్రాన్ని ఎంతో జాగ్రత్తగా నిర్మించి వచ్చే ఏడాది వేసవిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.**



✤